

## కార్యకర్త చెంప చెళ్లుమనిపించిన దీదీ!

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ .. ఓ కార్యకర్త చెంప చెళ్లుమనిపించారు. బరుయ్‌పుర్‌లో బాలిక అత్యాచార ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న దీదీ.. టీఎంసీ ఆధ్వర్యంలో కోల్‌కతాలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. దీనిని వ్యతిరేకిస్తూ బీజేపీ కూడా ప్రదర్శన చేపట్టింది. టీఎంసీ ర్యాలీ ముగింపు దశకు చేరుకుంటుండగా మమతా బెనర్జీ ఇంటి బయట భారీగా జనం గుమిగూడారు. దీంతో అక్కడ కొంతసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. వారిని చెదరగొట్టే క్రమంలో ఓ కార్యకర్తపై మమతా బెనర్జీ చేయి చేసుకున్నారు. మరికొందరిని కూడా పక్కకు నెట్టారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.మమతా బెనర్జీ.. సొంత పార్టీ కార్యకర్తపై చేయి చేసుకున్నారని భాజపా ఆరోపించింది. ఈ పరిణామంపై టీఎంసీ స్పందించింది. దీదీ ఎవరిపైనా చేయి చేసుకోలేదని స్పష్టం చేసింది. రద్దీ భారీగా ఉండటంతో వారిని నియంత్రించే ప్రయత్నం చేశారని.. కొట్టారని వస్తున్న వార్తలు నిరాధారమని పేర్కొంది.

## అప్పుడు ఆలయం వద్దని.. ఇప్పుడు రాజకీయాలు: కాంగ్రెస్‌పై కంగన ఫైర్



**విశ్వంభర,నేషనల్ బ్యూరో:** అయోధ్య విరాళాల్లో దుర్వినియోగానికి పాల్పడిన వారిని బీజేపీ, ఆరెస్సెస్‌లు కలిసి కాపాడుతున్నాయని కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలను భాజపా ఎంపీ కంగనా రనౌత్ తిప్పి కొట్టారు. ఎన్నో ఏళ్లుగా అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని వ్యతికేంచిన పార్టీ.. ఇప్పుడు అదే అంశంతో రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి గురించి దేశప్రజలందరికీ తెలుసన్నారు. శతాబ్దాల తరబడి సాగిన పోరాటం..భక్తి ఫలితంగానే రామమందిర నిర్మాణం సాధ్యమైందని కంగన పేర్కొన్నారు. సనాతన సంస్కృతి, విశ్వాసం, దేశ వారసత్వాన్ని పరిరక్షించడానికి భాజపా ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. తమ పార్టీ ప్రజల విశ్వాసాన్ని ఓటు బ్యాంకు రాజకీయాలకు సాధనంగా వాడుకోలేదన్నారు. అందుకు విరుద్ధంగా కాంగ్రెస్ (జశీఅస్త్రతీవం) పార్టీ స్వప్రయోజనాల కోసం మతాలను సాధనంగా వాడుకుంటోందని విమర్శించారు. రామమందిరం వంటి పవిత్రమైన అంశాన్ని రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు.

## ఫిఫా ప్రపంచకప్ ఫైనల్.. పరీక్షలు వాయిదా వేసిన పాఠశాల




**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** పిల్లలు ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ చూసేందుకు ఓ పాఠశాల పరీక్షలనే వాయిదా వేసింది. కోల్‌కతాలోని సౌత్ పాయింట్ హైస్కూల్ ఈ వినూత్న నిర్ణయం తీసుకుంది. ప్రపంచకప్ ఫైనల్‌ను విద్యార్థులు ఎలాంటి ఆందోళన లేకుండా వీక్షించాలని భావించి జులై 20, 21 తేదీల్లో జరగాల్సిన పరీక్షలను వాయిదా వేసింది.జులై 20న ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. మ్యాచ్ చూసి నిద్రలేకుండా పరీక్షలకు రావాల్సిన పరిస్థితి విద్యార్థులకు ఉండకూడదని భావించి.. పరీక్షలను జులై 29, 30 తేదీలకు వాయిదా వేసింది. దీనిపై ప్రిన్సిపాల్ జయదేవ్ ఘోష్ మాట్లాడుతూ.. ఫుట్‌బాల్ కేవలం ఆట మాత్రమే కాదని.. జట్టుగా పనిచేయడం, సహకారం, సమష్టి పోరాటం వంటి విలువలు నేర్పుతుందని చెప్పారు. ప్రపంచకప్ ఫైనల్‌ను పిల్లలు చూసి ఆస్వాదించే అవకాశం కల్పించడమే తమ ఉద్దేశమన్నారు. ఈ నిర్ణయాన్ని పిల్లల తల్లిదండ్రులూ స్వాగతించారు. చదువుతో పాటు క్రీడలు కూడా పిల్లల సమగ్ర వికాసానికి ముఖ్యమన్నారు.

## బాలికపై హత్యాచారం.. కీలక నిందితుడి ఎన్‌కౌంటర్

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** పశ్చిమ బెంగాల్‌లోని బరుయ్‌పుర్‌లో 11 ఏళ్ల బాలికను అత్యాచారం చేసి హత్య చేసిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కీలక నిందితుల్లో ఒకడు బుధవారం తెల్లవారుజామున పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం అతడిని తీసుకెళ్లగా పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించినట్లు అధికారులు తెలిపారు. ఓ పోలీసు సిబ్బంది వద్ద ఉన్న తుపాకీ లాక్కొని పారిపోవడానికి యత్నించడమే కాకుండా.. ఒక రౌండ్ కాల్పులు కూడా జరిపాడని పేర్కొన్నారు. దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురు కాల్పులు జరపగా అతడికి బుల్లెట్ గాయాలయ్యాయని వెల్లడించారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ కేసులో అతడు ప్రధాన నిందితుల్లో ఒకడని, బాలిక అదృశ్యమయ్యే ముందు ఆమెతో కలిసి ఉన్నట్లు సీసీటీవీ దృశ్యాల్లో గుర్తించినట్లు చెప్పారు. హత్యాచార ఘటనపై స్థానికుల నుంచి తీవ్ర ఆందోళనలు వ్యక్తమైన విషయం తెలిసిందే. బాలిక మృతదేహం లభించిన కొద్ది గంటల్లోనే అనుమానంతో ఓ వ్యక్తిని స్థానికులు కొట్టి చంపారు. ఈ కేసులో ఇప్పటివరకు ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు, ఆరుగురు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేశారు. మరోవైపు ఈ ఘటనపై 72 గంటల్లో నివేదిక సమర్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారి డీజీపీని ఆదేశించారు.

# తోటలో నక్కిన ఆ ఉగ్రవాది ఎన్‌కౌంటర్..

## పహల్గాం దాడితో సంబంధాలు..!



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేతకు ఆపరేషన్ చేపట్టిన భద్రతా బలగాలు భారీ విజయం సాధించాయి. షోపియాన్‌లో ఓ పండ్ల తోటలో నక్కిన ఉగ్రవాదుల్లో ఒకడిని బుధవారం హతమార్చాయి. మృతుడిని లష్కరే తయ్యిబా టాప్ కమాండర్ జాకిర్ అహ్మద్ గనీగా గుర్తించారు. అతడికి పహల్గాం ఉగ్రదాడితో సంబంధాలున్నట్లు దర్యాప్తు వర్గాల సమాచారం. షోపియాన్‌లోని ఓ పండ్ల తోటలో ఉగ్రవాదులు నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలు ఇటీవల నిఘా కెమెరాల్లో రికార్డయ్యాయి. దీంతో జమ్మూకశ్మీర్ పోలీసులు, ఆర్మీ, సీఆర్పీఎఫ్ దళాలు జులై 3న సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. ఉగ్రవాదులు నక్కిన ప్రాంతాన్ని నలుమూలల నుంచి దిగ్బంధించి వేట మొదలుపెట్టాయి. దాదాపు ఐదు రోజులుగా కొనసాగుతోన్న ఈ ఆపరేషన్‌లో బుధవారం ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. భద్రతా బలగాలను గమనించిన ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో సిబ్బంది ఎదురుకాల్పులు జరిపినట్లు అధికారులు వెల్లడించారు. అనంతరం ఘటనాస్థలంలో ఓ ఉగ్రవాది మృతదేహాన్ని గుర్తించారు. అతడిని జాకిర్ అహ్మద్ గనీగా తేల్చారు. అతడితో పాటు ఉన్న మరో ఉగ్రవాది లతీఫ్ భట్ కోసం భద్రతా బలగాలు గాలిస్తున్నాయి. అతడు బయటకు వెళ్లకుండా తోట చుట్టూ దళాలు మోహరించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌పై జమ్మూకశ్మీర్ పోలీసులు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "మీరు పారిపోవచ్చేమో.. కానీ దాక్కోలేరు" అని ఉగ్రవాదులను హెచ్చరించారు.

**ఎవరీ జాకిర్ గనీ..**

కుల్గామ్‌కు చెందిన జాకిర్ గనీ.. కొన్నేళ్లుగా లష్కరే తయ్యిబా ముఠాలో కీలకంగా పనిచేస్తున్నాడు. గతంలో భద్రతా సిబ్బందిపై దాడులు, పౌరుల హత్యల కేసుల్లో కీలక నిందితుడిగా ఉన్నాడు. అప్పటి నుంచి అతడిపై నిఘా వర్గాలు దృష్టిపెట్టాయి. 2025 ఏప్రిల్‌లో పహల్గాంలో చోటుచేసుకున్న భీకర ఉగ్రదాడి ఘటనపై దర్యాప్తు సమయంలోనూ జాకిర్ పేరు వినిపించింది. ఆ కేసు దర్యాప్తులో భాగంగా అతడికి సంబంధించిన ఓ ఇంటిని కూడా కూల్చేసినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.

## నిజ్జర్ హత్యలో భారత అధికారుల ప్రమేయం లేదన్న కెనడా



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** భారత్-కెనడా దౌత్యసంబంధాల్లో ఒడుదొడుకులకు దారితీసిన ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకేసులో కీలకపరిణామం చోటుచేసుకుంది . ఈ కేసులో భారత అధికారుల ప్రమేయం ఉన్నట్లుగా ఎలాంటి ఆధారాలు లేవని కెనడా పోలీసులు తాజాగా ప్రకటించారు. దీంతో నాటి కెనడా ప్రధాని ట్రూడో చేసిన ఆరోపణలు తప్పుగా తేలాయి. మరోవైపు, గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్, అతడి సహచరుడు గోల్డీబ్రార్‌పై అమెరికాలో కేసు నమోదైంది. నిజ్జర్‌ను హత్యచేయాలని వారి నుంచి ఆదేశాలు అందాయని అమెరికా దర్యాప్తు అధికారులు ఛార్జిషీట్‌లో పేర్కొన్నారు.యూఎస్‌కు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అంతర్జాతీయస్థాయిలో 'ఆపరేషన్ హార్డ్‌బాల్'ను చేపట్టింది. దానిలో భాగంగా అమెరికా, కెనడా, ఐరోపా వ్యాప్తంగా బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన 24 మంది మంది అనుమానితులు అరెస్టు అయ్యారు. ఈ నేపథ్యంలోనే బిష్ణోయ్, గోల్డీబ్రార్‌పై అభియోగాలు నమోదయ్యాయి. భారత్‌లోని జైలు నుంచే నిజ్జర్ హత్యకు బిష్ణోయ్ కుట్ర చేశాడని, అతడి ఆదేశాలను ఉత్తర అమెరికాలో బ్రార్ సమన్వయం చేశాడని ఆ అభియోగాల్లో అమెరికన్ ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. ఇందుకోసం స్మగ్లింగ్ చేసిన ఫోన్లు వాడారని ఆరోపించారు. నిజ్జర్ ఫొటో, చిరునామాను బిష్ణోయ్ పంపాడని వెల్లడించారు. గోల్డీపై 50,000 డాలర్ల రివార్డును కూడా ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే భారత అధికారుల ప్రమేయం లేదని కెనడా నుంచి ఇప్పుడు స్పష్టత వచ్చింది. ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ 2023లో బ్రిటిష్ కొలంబియాలోని సర్రే ప్రాంతంలో హత్యకు గురైన సంగతి తెలిసిందే . ఈ ఘటన వెనక భారత ఏజెంట్ల హస్తం ఉందంటూ అప్పట్లో కెనడా ప్రధానిగా ఉన్న ట్రూడో చేసిన ఆరోపణలతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. వీటిని భారత్ తీవ్రంగా ఖండించింది. వాటిని సమర్థించే ఆధారాలు ఇవ్వాలని.. ఆ తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని పలుమార్లు స్పష్టంచేసింది. అయినప్పటికీ కెనడా ఈ ఆరోపణలు చేయడం మానుకోలేదు. అక్కడితో ఆగకుండా ఈ హత్య కేసు అనుమానితుల జాబితాలో భారత హైకమిషనర్ సంజయ్‌కుమార్ వర్మ పేరును చేర్చడంతో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. దీంతో ఇరుదేశాలు పరస్పరం దౌత్యవేత్తలను వెనక్కి పంపించాయి కూడా. తర్వాత మార్క్ కార్నీ అధికారంలోకి వచ్చాక సంబంధాల్లో పునరుద్ధరణ ప్రారంభమైన సంగతి తెలిసిందే.

## ఆ కారిడార్‌పై ఇరాన్ కన్నెర్ర.. భారత చమురు ట్యాంకర్ వెనక్కి!

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** అమెరికా-ఇరాన్‌ల పరస్పర దాడులతో హర్మూజ్ జలసంధిలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో ఒమన్ కారిడార్ నుంచి వెళ్తున్న ఓ భారత చమురు ట్యాంకర్‌ను ఇరాన్ భద్రతా దళాలు వెనక్కి పంపించినట్లు తెలిసింది. అమెరికా పర్యవేక్షణలోని ఒమన్ కారిడార్ కాకుండా హర్మూజ్ జలసంధిలో తాము నిర్దేశించిన మార్గాన్నే వినియోగించుకోవాలని ఐఆర్‌జీసీ సూచించినట్లు సమాచారం.గల్ఫ్ సముద్ర జలాల్లో చిక్కుకుపోయిన నౌకలు వాటి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకునేందుకు వీలుగా ప్రత్యామ్నాయం చూపించిన ఒమన్, ఐరాస సముద్రయాన సంస్థలు.. ఒమన్ తీరం నుంచి వెళ్లాలని సూచించాయి. దీంతో అమెరికా పర్యవేక్షణలో ఉన్న ఈ తాత్కాలిక కారిడార్‌నే ఆయా నౌకలు ఉపయోగించుకుంటున్నాయి. అయితే, ఐఆర్‌జీసీ మాత్రం తాము సూచించినట్లు హర్మూజ్ మార్గంలోనే వెళ్లాలని నౌకలను హెచ్చరిస్తున్నట్లు తెలిసింది.

**హర్మూజ్‌లో 9 భారత నౌకలు..**

జలసంధిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ పర్షియన్ గల్ఫ్‌లో తొమ్మిది భారత ట్యాంకర్లు చిక్కుకున్నాయని, వాటిలో 198 మంది



నావికులు ఉన్నట్లు తెలిసింది. వీటిలో పూర్తి స్థాయిలో ఇంధనం, గ్యాస్‌తో కూడిన నౌకలు ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అక్కడి పరిస్థితులను నిశితంగా గమనిస్తున్న భారత ప్రభుత్వం.. ఆ నౌకలను సురక్షితంగా గమ్యానికి చేర్చేందుకు ఇరాన్‌తో సంప్రదింపులు జరిపేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి.

## రెండు మూడు నెలలకే ఆరుగురు సిబ్బంది చేతివాటం మొదలుపెట్టారు

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** అయోధ్య విరాళాల చోరీకి సంబంధించి జరుగుతోన్న దర్యాప్తులో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి . రామాలయ విరాళాల కౌంటింగ్ కేంద్రాల నుంచి రూ.500 నోట్లతో మొదలైన ఈ చేతివాటం.. తర్వాత కట్టలకొద్దీ తస్కరించే వరకూ వెళ్లిందని సిట్ గుర్తించింది. ఆ మొత్తం రూ.2-3 కోట్ల వరకు ఉంటుందని పేర్కొంది. సీసీటీవీ నిఘా, భద్రతా నిబంధనల్లోని లోపాలను నిందితులు తమకు అనుకూలంగా మార్చుకున్నారని వెల్లడించింది. ఆలయ విరాళాల లెక్కింపు ప్రక్రియలో భాగమైన రెండు మూడు నెలలకే ఆరుగురు సిబ్బంది చేతివాటం మొదలుపెట్టారని, తొలుత కరెన్సీ నోట్లను జేబులో వేసుకున్నారని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. తమ దుస్తుల్లో ఆ నోట్లను దాచుకొని, బయటకు తీసుకెళ్లినట్లు నిందితులు అంగీకరించారు.ఆ దొంగతనాలను ఎవరూ గుర్తించకపోవడంతో క్రమంగా ఆ నోట్ల సంఖ్య పెరిగింది. మొత్తం రూ.2-3 కోట్లు చోరీ చేశారు.విరాళాల సేకరణ, లెక్కింపు, బ్యాంక్‌లో జమ విషయంలో శ్రీరామ జన్మభూమి తీర్థట్రస్ట్, ఎస్‌బీఐ మధ్య ఒప్పందం ఉంది. దీని ప్రకారం.. విరాళాల బాక్సులను ట్రస్ట్, ఎస్‌బీఐ ప్రతినిధుల ఆధ్వర్యంలో తెరవాలి. ప్రతి




డొనేషన్ బాక్స్‌లోని నగదును విడిగా లెక్కించాలి. సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి. వారు యూనిఫామ్‌లోనే ఉండాలి. కౌంటింగ్ గదిలోకి వ్యక్తిగత వస్తువులు ఏవీ తీసుకురాకూడదు. ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద తనిఖీ తప్పనిసరి. అయితే వీటిలో పలు నిబంధనలు సరిగా అమలుకావడం లేదని సిట్ గుర్తించింది. అలాగే అవినాశ్ శుక్లాను ప్రధాన నిందితుడిగా పేర్కొంది. అతడికి వ్యతిరేకంగా బలమైన సాక్ష్యాలు లభించాయని వెల్లడించింది.

## ముంబయికి అతిభారీ వర్ష సూచన.. పొంగిపొర్లుతున్న సరస్సులు

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** ముంబయి, పరిసర ప్రాంతాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. నగరానికి తాగునీరు అందించే ఏడు సరస్సుల్లోకి భారీగా వరద నీరు వస్తోంది. వీటిల్లో చిన్నదైన తులసి, విహార్‌లు మంగళవారం రాత్రి నుంచి పొంగిపొర్లుతున్నాయి. మరోవైపు భారీ వర్షాల కారణంగా ముంబయిలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచి జనజీవనం స్తంభించింది. పశ్చిమ రైల్వేలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముంబయితో పాటు థానే, పాల్ఘర్, రాయగఢ్ జిల్లాల్లో బుధవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. జులై 9 నుంచి వర్షాల తీవ్రత క్రమంగా తగ్గే అవకాశం ఉందని, 12 నుంచి చాలా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.

**ఢిల్లీకి రెడ్ అలర్ట్** రాబోయే కొద్ది గంటల్లో దిల్లీలో ఉరుములు,



మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఈ క్రమంలో దిల్లీలోని పలు ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. అత్యవసరమైతేనే ప్రజలు బయటకు వెళ్లాలని సూచించింది.



## పుణెలో కూలిన భవనం.. శిథిలాల కింద 15 మంది!

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** మహారాష్ట్రను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఈ క్రమంలో పుణె జిల్లా పింప్రి-చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహణలో ఉన్న ఓ వ్యర్థాల రీసైక్లింగ్ ప్లాంటులో మూడంతస్తుల భవనం కుప్పకూలింది. శిథిలాల కింద 15 మంది ఉద్యోగులు చిక్కుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. రంగంలోకి దిగిన అగ్నిమాపక, విపత్తు నిర్వహణ బృందాలు.. సహాయక చర్యలు చేపట్టాయి.వారం రోజులుగా పుణె, పింప్రి-చించ్వాడ్ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి సుమారు ఆరు వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికల నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలను మూసివేశారు.

## పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. ఆందోళన వ్యక్తం చేసిన భారత్




**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** పశ్చిమాసియాలో తాజాగా నెలకొన్న ఉద్రిక్తతలు, వాణిజ్య నౌకలే లక్ష్యంగా జరుగుతున్న దాడులపై భారత విదేశాంగశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. తాజా పరిణామాలు ఆ ప్రాంత శాంతిభద్రతలను, స్థిరత్వాన్ని దెబ్బతీస్తాయని తెలిపింది. అన్ని పక్షాలు సంయమనం పాటించి.. ఉద్రిక్తతలను తగ్గించాలని పిలుపునిచ్చింది. పౌరుల రక్షణకు ప్రాధాన్యమివ్వాలని.. వాణిజ్యం, ఇంధన సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని కోరింది. శాంతియుతమైన, శాశ్వత పరిష్కారాన్ని సాధించేందుకు తిరిగి చర్చలు ప్రారంభించాలని సూచించింది.ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్‌లో తొమ్మిది భారత ట్యాంకర్లు చిక్కుకున్నాయని, వాటిలో 198 మంది నావికులు ఉన్నట్లు తెలిసింది. ఇవన్నీ పూర్తి స్థాయిలో ఇంధనం, గ్యాస్‌తో కూడిన నౌకలేనని వెల్లడైంది. ఈ నేపథ్యంలో ఆ నౌకలను సురక్షితంగా గమ్యానికి చేర్చేందుకు ఇరాన్‌తో సంప్రదింపులు జరిపేందుకు ఉన్న అవకాశాలను భారత ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం.

## ఆ వివాహంలో.. కట్నం ఒక్క రూపాయి



**విశ్వంభర, సీకర్:** రాజస్థాన్‌లోని ఓ కుటుంబం ఆదర్శప్రాయంగా నిలిచింది. ఓ వ్యక్తి తమ కుటుంబంలోకి వచ్చే కోడలి నుంచి ఎటువంటి వరకట్నం తీసుకోలేదు. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. జిల్లాలో అర్జున్‌రామ్ బురానీయా కుమారుడు సుభాష్ బురానీయాకు అదే ప్రాంతానికి చెందిన సరోజ్‌తో వివాహం కుదిరింది. నిశ్చితార్థం సమయంలోనే ఇరు కుటుంబపెద్దలు ఎటువంటి కట్నకానుకలు లేకుండా వివాహం జరపాలని నిర్ణయించుకున్నారు. అనుకున్న ప్రకారమే పెళ్లి పీటలపై వరుడు కేవలం ఒక్క రూపాయి, కొబ్బరి కాయను తీసుకొని వివాహం చేసుకున్నాడు. తమ కుటుంబంలో జరిగే వివాహాల్లో వరకట్నం తీసుకోకూడదని, ఇవ్వకూడదని తమ తండ్రి తీసుకున్న నిర్ణయం ప్రకారం తన పెళ్లి జరగడంపై సంతోషం వ్యక్తం చేశాడు. గతంలోనూ అర్జున్‌రామ్ తన కుమార్తె వివాహానికి కట్నం ఇవ్వకపోవడం గమనార్హం.

## బాలికల పాఠశాలపై కమాండర్ల దాడి..!



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల సమయంలో మినాబ్‌లోని ఓ పాఠశాలపై జరిగిన దాడి ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన సంగతి తెలిసిందే. డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అందించిన పాత సమాచారంతోనే అమెరికా సెంట్రల్ కమాండ్ లక్ష్యాలను నిర్దేశించడంతో పాఠశాల టార్గెట్ అయిందని ఇప్పటికే కథనాలు వచ్చాయి. ఆ సమాచారం కాలం చెల్లిందంటూ ఆ తర్వాత నిఘా వర్గాలు చేసిన హెచ్చరికలను అమెరికా కమాండర్లు పెడచెవిన పెట్టి, దాడులకు దిగారని తాజాగా అమెరికా మీడియా సంచలన కథనం వెల్లడించింది.ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభంలో ఇరాన్ లోని లక్ష్యాలను గుర్తించే తొందరలో.. నిఘా హెచ్చరికలను సీనియర్ కమాండర్లు విస్మరించారని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ మీడియా కథనం పేర్కొంది. పాత సమాచారం వల్లే ఆ తప్పిదం చోటుచేసుకుందని దాడి జరిగిన కొద్దిరోజులకే అమెరికా మిలిటరీ అధికారులకు తెలిసింది. అయితే నెలలు గడిచినా పెంటగాన్ ఆ ఘటనకు సంబంధించి ఎలాంటి దర్యాప్తు నివేదిక విడుదల చేయలేదు. దర్యాప్తు జరుగుతోందని వైట్‌హౌస్ సిబ్బంది చెప్తున్నారు. ఫిబ్రవరి 28న ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ స్థావరాలపై దాడులు చేస్తుండగా మినాబ్‌లోని ఓ పాఠశాలను క్షిపణి తాకింది. ఈ ఘటనలో 160 మందికి పైగా చిన్నారులు, 14 మంది టీచర్లు ప్రాణాలు కోల్పోయినట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది. అమెరికా ప్రయోగించిన తొమహాక్ క్షిపణే పేలుడుకు కారణమని వార్తలు వచ్చాయి. 2013 నాటి శాటిలైట్ చిత్రాల ద్వారా ఈ పాఠశాల, ఐఆర్‌జీసీ బేస్ ఒకే ప్రాంగణంలో ఉన్నట్లు తెలిసింది. ఆ తర్వాత 2016 నాటి ఉపగ్రహ చిత్రాలను పరిశీలిస్తే.. ఈ రెండింటి మధ్య ఫెన్సింగ్ ఏర్పాటుచేసినట్లు కన్పించింది. స్కూల్ భవనానికి ప్రత్యేక ప్రవేశ మార్గం కూడా ఉంది. పాఠశాల ప్రాంగణంలో పిల్లలు ఆడుకుంటున్నట్లు గతేడాది డిసెంబరు నాటి శాటిలైట్ ఫొటోల్లో ఉంది.